ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి: 19 సంచిక : 37 | బుధవారం 08, అక్టోబర్ 2025 | పేజీలు: 08 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com


# రేవంత్ మాటల్లో ఫేకుడు.. చేతల్లో జోకుడు

**టీవీవీపీ, బస్తీ దవాఖానల సిబ్బంది వేతనాలు పెండింగ్**
**సీఎం మాటలు కోటలు దాటతాయి కానీ చేతలు గడప దాటవు**
**ఉద్యోగుల పండుగలు చెడగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం**
**జీతాలు ఇప్పుడైనా చెల్లించండి.. దీపావళి ఆనందం ఇవ్వండి**
**మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ), బస్తీ దవాఖానల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వైఫల్యాలపై ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటతాయి కానీ చేతలు మాత్రం గడప దాటవు అని ఆయన హెద్దేవ చేశారు. ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామంటూ ప్రచారం చేసుకోవడం తప్ప, ఆచరణలో మాత్రం శూన్యం అని హరీష్ రావు వ్యాఖ్యానించారు. రెగ్యులర్ ఉద్యోగులకు రెండు మూడు వారాలు దాటినా జీతాలు రాకపోవడం, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నెలల తరబడి వేతనాలు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. "బస్తీ దవాఖానల వైద్య సిబ్బందికి అయితే ఆరు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వైద్యులు, సిబ్బంది బతుకమ్మ, దసరా పండుగలను ఆనందించలేకపోయారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం" అని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు పలు మార్లు వినతులు చేసినా స్పందన లేకపోవడం దుర్మార్గమని, అత్యవసర సేవలు అందించే వైద్య సిబ్బందికే జీతాలు ఇవ్వకపోతే ఇతర శాఖల ఉద్యోగుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. "పథకాల్లో కోతలు, ప్రభుత్వ

..మిగతా 2లో

# బీసీ రిజర్వేషన్లపై సీఎం ఫోకస్



**తెలంగాణ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై ప్రతిష్ఠాత్మక దృష్టి**
**సుప్రీంకోర్టు విచారణలో రాష్ట్రానికి బలమైన వాదనలు**
**సీఎం రేవంత్- అభిషేక్ సింఘ్వి కీలక సమన్వయం**
**హైకోర్టు ముందు ప్రత్యేక వ్యూహ సమావేశం**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సామాజిక న్యాయం దిశగా చారిత్రాత్మక నిర్ణయంగా భావిస్తున్న ఈ వ్యవహారంలో ఏ మాత్రం నిర్లక్ష్యం జరగకుండా ఉండేందుకు సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. సుప్రీంకోర్టు నుంచి హైకోర్టు దాకా ప్రతి దశలోనూ బీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం తన పూర్తి శక్తిని వినియోగిస్తోంది. ఇటీవల సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తెలంగాణ తరపున ప్రముఖ న్యాయ నిపుణులు అభిషేక్ సింఘ్వి, సిద్ధార్థ దవే లు హాజరై వాదనలు వినిపించారు. ఈ విచారణకు ముందే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశాలు ఇవ్వడంతో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లతో కూడిన బృందం ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులతో విస్తృతంగా చర్చించింది. కేసు ప్రాధాన్యత దృష్ట్యా భట్టి విక్రమార్క, మంత్రుల బృందం స్వయంగా సుప్రీంకోర్టు విచారణను ప్రత్యక్షంగా పర్యవేక్షించింది. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వి తో ఫోన్ లో మాట్లాడారు. రేపు (బుధవారం) హైకోర్టులో జరగనున్న బీసీ రిజర్వేషన్ల కేసు విచారణకు స్వయంగా హాజరై వాదనలు వినిపించాలని ఆయన కోరారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఢిల్లీలో సింఘ్విని కలసి


..మిగతా 2లో



## గుడిసెల్లో పేదలకు ఇల్లు ఇచ్చే బాధ్యత నాది

**ప్రజలు కక్ష్యలకు, కార్పణ్యాలకు దూరంగా ఉండాలి**
**మీ డివిజన్లను మీరే పరిశుభ్రంగా ఉంచుకోవాలి**
**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

02




## కాళేశ్వరంపై హైకోర్టులో విచారణ వాయిదా

**కమిషన్ రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని ఆదేశం**
**కేసీఆర్, హరీశ్ రావుకు మధ్యంతర ఉత్తర్వుల పొడిగింపు**
**తదుపరి ఉత్తర్వులు వెల్లడించెంతవరకు చర్యలు తీసుకోవద్దు**

02

# తెరపైకి తెలుగుదేశం పార్టీ

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చంద్రబాబు ఫోకస్**
**టీడీపీ భవన్‌లో తెలంగాణ నేతలతో భేటీ**
**జూబ్లీహిల్స్ సెగ్మెంట్ ఉప ఎన్నికపై చర్చ**
**చంద్రబాబు మద్దతు ఎవరికనేదానిపై ఉత్కంఠ**




**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారిపోతున్నాయి.. ఇప్పటికే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్ ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. నవంబర్ 11వ తేదీన ఉప ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ జరగనుండగా.. నవంబర్ 14వ తేదీన

..మిగతా 2లో

# చెవుల్లో ఇయర్‌ఫోన్స్.. చేతిలో స్మార్ట్‌ఫోన్!

**ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై సీపీ సీరియస్ వార్నింగ్**
**డ్రైవర్లు ఫోన్ చూస్తూ డ్రైవింగ్ చేస్తే చర్యలు**
**జీవితం కంటే పెద్దది ఏ సమస్య కాదు.. జాగ్రత్తగా ఉండాలి**
**హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

రయ్.. రయ్.. మంటూ రోడ్డుపై పరుగులు పెడుతున్న వాహనాలు.. డ్రైవింగ్ సీటులో డ్రైవర్ కానీ, వారి దృష్టి రోడ్డుపై లేదు. చేతిలో మొబైల్ ఫోన్.. లేదా చెవుల్లో ఇయర్‌ఫోన్స్. ఆటో రిక్షా, క్యాబ్, బైక్ టాక్సీ

..మిగతా 2లో

# అత్యున్నత స్థాయికి అసహనం

**సీజేఐ గవాయ్‌పై బూటుతో దాడికి యత్నం**
**ఇలాంటి దాడులు ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు**
**ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదు.. వ్యవస్థపై జరిగిన దాడి**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ.ఆర్. గవాయ్‌పై ఓ న్యాయవాది బూటుతో దాడికి ప్రయత్నించడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. దేశంలో అసహనం అత్యున్నత స్థాయికి చేరుకుందని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు అని అన్నారు. సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి, అసహనం పెరిగిందనడానికి సంకేతమని ఆయన పేర్కొన్నారు. ఈ దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. న్యాయవ్యవస్థ గౌరవంపై జరిగిన ఈ సిగ్గుచేటైన దాడి కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదని, ఇది వ్యవస్థపై జరిగిన దాడి అని వ్యాఖ్యానించారు. విశ్వాసం వంటి సున్నితమైన అంశాలపై ఎలాంటి విభేదాలు ఉన్నా కూడా హింసను

..మిగతా 2లో

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్ స్తబ్ధతకు కారణాలివే

**మార్కెట్ నెమ్మదించడానికి హైడ్రా కారణం కాదు**
**పెరిగిన అన్‌సోల్డ్ ఇన్వెంటరీ, తగ్గిన ఎన్నారై పెట్టుబడులు**
**వడ్డీ రేట్ల పెరుగుదల, ఏఐతో ఉద్యోగ భయాలు**
**ఖమ్మం, వరంగల్‌లో కూడా ఇదే పరిస్థితి**
**హైడ్రాపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం**
**హైడ్రా కమిషనర్ రంగనాథ్**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

గత కొంతకాలంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న స్తబ్ధతకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలోని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) తీసుకుంటున్న

..మిగతా 2లో

## అసహనం అత్యున్నతస్థాయికి చేరింది

మొదటిపేజీ తరువాయి



సమర్థించకూడదని అన్నారు. ఇటువంటి దాడులు ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు కలిగిస్తాయని కేటీఆర్ పేర్కొన్నారు. నిన్న సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తిపై ఓ న్యాయవాది చెప్పుతో దాడికి యత్నించడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది.

## చెవుల్లో ఇయర్‌ఫోన్స్.. చేతిలో స్మార్ట్‌ఫోన్!



మొదటిపేజీ తరువాయి

డ్రైవర్లు ఇలా చేస్తూ నగరంలో తరచుగా కనిపిస్తున్నారు. తమ జీవితంతో పాటు, ప్రయాణికుల, రోడ్డుపై ఉన్న వేలాది మంది ప్రాణాలను సైతం ప్రమాదంలోకి నెడుతున్నారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్‌లో వీడియోలు చూడడం, ఇయర్‌ఫోన్స్ వినియోగించడం చట్టరీత్యా నేరం. ఇది కేవలం నిర్లక్ష్యం కాదు, ప్రాణాలు తీసే నేరం. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ వాడటం వల్ల దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేలల్లో ప్రమాదాలు, వందల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. ఈ ప్రమాదకర ఉల్లంఘనలపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్‌లు కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఇలాంటి నిర్లక్ష్యాన్ని ఏ మాత్రం ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్. జరిమానాలు, చట్టాలు.. ఇవన్నీ ఒకవైపు. డ్రైవర్, ప్రయాణికులు, ఇతర రోడ్డుపై ప్రయాణించే వారి భద్రత అత్యంత ముఖ్యమైనది. క్షణికావేశంలోనో, చిరు కాలక్షేపం కోసమో చేసే చిన్న పొరపాటు తీరని విషాదాన్ని మిగులుస్తుంది. జీవితం కంటే పెద్దది ఏ సమస్య కాదు. డబ్బు సంపాదించడం, ఎక్కడికో త్వరగా చేరుకోవడం, ఫ్రెండ్స్ తో మాట్లాడటం.. ఏదీ మీ ప్రాణం, మీ కుటుంబ ఆనందం కంటే ముఖ్యం కాదు.

## రేవంత్ మాటల్లో ఫేకుడు.. చేతల్లో జోకుడు

మొదటిపేజీ తరువాయి



ఉద్యోగులకు వేతనాలు చెల్లించక వాతలు.. ఇదే రేవంత్ రెడ్డి పాలన. మాటల్లో ఫేకుడు, ఢిల్లీకి వెళ్లి జోకుడు. నీ వైఫల్యం రాష్ట్ర ప్రజలందరికీ శాపంగా మారింది" అంటూ హరీశ్ రావు తీవ్రంగా దుయ్యబట్టారు. "జీతాలు ఇవ్వకుండా 13 వేల మంది వైద్య సిబ్బందికి దసరా దూరం చేసావు. కనీసం ఇప్పుడైనా జీతాలు చెల్లించి వారికి దీపావళి సంబురం ఇవ్వాలి" అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గుడిసెల్లో బతికే పేదలకు ఇల్లు ఇచ్చే బాధ్యత నాది..

- ప్రజలు కక్ష్యలకు, కార్పణ్యాలకు దూరంగా ఉండాలి
- మీ డివిజన్లను మీరే పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

ఖమ్మం నగరంలో రోడ్లు, డ్రైనేజీలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం పట్టణం గతంలో చిన్న పంచాయతీగా ఉండేది, కేవలం 4 వేల జనాభా మాత్రమే ఉండేవాళ్లు అన్నారు. ఇక, మీ డివిజన్లను మీరే పరిశుభ్రంగా ఉంచుకోవాలి, డివిజన్‌కు కావలసిన మౌలిక సదుపాయాలు కమిషనర్ అభిషేక్ అగస్త్యను సంప్రదించండి అని సూచించారు. మన కార్పొరేషన్‌ను చూసి ఇతర ప్రాంతాలు నేర్చుకునేలా ఉండాలి అన్నారు. నగరం ప్రశాంతమైన వాతావరణం ఉండాలి, కక్ష్యలకు, కార్పణ్యాలకు దూరంగా ఉండాలని మంత్రి తుమ్మల కోరారు. అయితే, ఉన్నతమైన చదువులు చదివితే ఆ కుటుంబం పేదరికాన్ని వీడుతుంది అని మంత్రి నాగేశ్వరరావు తెలిపారు. నగర వాసులకు హైదరాబాద్, అమెరికా కంటే మంచి చదువు ఖమ్మం నగరానికి వస్తుంది అని భరోసా ఇచ్చారు. పోలీసులకు సూచించా పార్టీల పరంగా పోలీసులు ఎవరి పైనా కేసులు పెట్టొద్దని.. అలాగే, రోడ్ల వెడల్పు కోసం నాయకుల ఇండ్ల అయినా కొంత తీసుకోక తప్పదు అన్నారు. బైపాస్ రోడ్డు వేసినప్పుడు నన్ను తిట్టుకున్నారు, ఇప్పుడు బైపాస్ రోడ్డు కూడా జామ్ అవుతుంది.. ఇంకా రెండు మూడు వందల కోట్ల రూపాయలు సీఎం రేవంత్ రెడ్డినీ అడిగి తీసుకుని వస్తాను.. గుడిసెల్లో బ్రతికే పేదలకు ఇల్లు ఇచ్చే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. పేదలకు మంచి చేసే విధంగా రాజకీయం ఉండాలి, ఇబ్బంది పెట్టే విధంగా ఉండకూడదని తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.



# కాళేశ్వరంపై హైకోర్టులో విచారణ వాయిదా

- కమిషన్ రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని ఆదేశం
- కేసీఆర్, హరీశ్ రావుకు మధ్యంతర ఉత్తర్వుల పొడిగింపు
- తదుపరి ఉత్తర్వులు వెల్లడించెంతవరకు చర్యలు తీసుకోవద్దు

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకొని చర్యలు తీసుకోవద్దని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే నెల 12వ తేదీకి వాయిదా వేసింది. ఈ సందర్భంగా హైకోర్టు ఇప్పటికే ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు చేపట్టకూడదని కేసీఆర్, హరీశ్ తమ పిటిషన్లలో వాదించారు. ఆ నివేదికను పూర్తిగా రాజకీయ ఉద్దేశ్యాలతో రూపొందించారని, దాని ఆధారంగా చర్యలు తీసుకోవడం చట్టపరంగా సరైంది కాదని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎటువంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా ఆదేశించింది. కమిషన్ తరపున లాయర్ నిరంజన్ రెడ్డి ఈ విచారణ సందర్భంగా కౌంటర్ అఫిడవిట్ సమర్పించకపోవడంపై క్షమాపణలు కోరారు. కొన్ని వివరాలు సేకరించడంలో ఆలస్యం జరిగిందని, త్వరలోనే సమగ్రమైన కౌంటర్ సమర్పిస్తామని కోర్టుకు తెలిపారు. హైకోర్టు ఆయన వివరణను అంగీకరించి, తదుపరి విచారణ తేదీని నిర్ణయించింది. ఇక ఇదే కేసులో మాజీ ముఖ్య కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై కూడా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. కమిషన్ నివేదికలో తమ పేర్లు ప్రస్తావించబడిన నేపథ్యంలో ప్రభుత్వం తమపై చర్యలు తీసుకోకుండా ఉండాలని వారు కోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పీసీ ఘోష్ కమిషన్ నివేదికను సీబీఐకి పంపిన విషయం తెలిసిందే. అయితే హైకోర్టు, ఆ నివేదిక ఆధారంగా నేరుగా చర్యలు చేపట్టకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. సీబీఐ తన స్వతంత్ర విచారణను చట్టపరమైన విధానాల ప్రకారం కొనసాగించవచ్చని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణ వచ్చే నెల 12న జరగనుంది. అప్పటి వరకు కమిషన్ నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ సీఎస్ జోషి, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌లపై ఎటువంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు స్పష్టం చేసింది.




# బీసీ రిజర్వేషన్లపై సీఎం రేవంత్ ఫోకస్

మొదటిపేజీ తరువాయి

అదే విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత సున్నితమైనదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించాలని వారు కోరారు. హైకోర్టులో రేపు జరగనున్న విచారణకు ముందు, కేసు పురోగతిపై సమగ్ర సమీక్ష జరపాలని సీఎం నిర్ణయించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం 4:30 గంటలకు హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొననున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశం సామాజిక సమతుల్యతకు సంబంధించిన కీలకమైన అంశమని ప్రభుత్వం భావిస్తోంది. కేసు పురోగతిని గంట గంటకు పర్యవేక్షిస్తూ, న్యాయపరంగా ఏ మార్పులు వచ్చినా తక్షణమే వ్యూహాన్ని సవరించుకునేలా ప్రత్యేక టీమ్‌ను సీఎం రేవంత్ ఏర్పాటు చేశారు. న్యాయ పోరాటంతో పాటు రాజకీయ, సామాజిక వర్గాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయి.

## తెరపైకి తెలుగుదేశం పార్టీ

మొదటిపేజీ తరువాయి

కౌంటింగ్ నిర్వహించి ఫలితాన్ని ప్రకటించనున్నారు.. అయితే, ఈ నెల 13న నోటిఫికేషన్ విడుదల కానుండగా.. ఈ నెల 13 నుంచి 21వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు.. 22న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు 24వ తేదీ వరకు అవకాశం కల్పించారు. అయితే, అన్ని పార్టీలు జూబ్లీహిల్స్‌పై ఫోకస్ పెట్టాయి.. ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తమ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత గోపీనాథ్ పేరును ప్రకటించారు. ఇక, ఇవాళో.. రేపు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరు అనేది తేలిపోనుంది.. ఇంకో వైపు.. బీజేపీ కూడా తమ అభ్యర్థిని పెట్టేందుకు సమావేశాలు నిర్వహిస్తోంది.. ఇప్పుడు అనూహ్యంగా జూబ్లీహిల్స్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తెరపైకి వచ్చింది.. ఇవాళ తెలంగాణకు చెందిన టీడీపీ నేతలతో సమావేశం అయ్యారు. టీడీపీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు.. ఈ సమావేశంలో ప్రధానంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపైనే చర్చ సాగింది. దీంతో, టీడీపీ తమ అభ్యర్థిని బరిలోకి దింపనుందా? లేదు ఏ పార్టీకైనా మద్దతు పలుకుతుందా? అనేది చర్చగా మారింది. అయితే, జూబ్లీహిల్స్ సిట్టింగ్ ఎమ్మెల్యే గోపీనాథ్ మృతిచెందిన నేపథ్యంలో ఈ ఉపఎన్నిక జరుగుతోన్న విషయం విదితమే కాగా.. మాగంటి గోపీనాథ్ టీడీపీలో గెలిచి బీఆర్ఎస్‌లోకి వెళ్లిన వ్యక్తే కావడం.. మరోసారి అదే ఫ్యామిలీకి టికెట్ ఇవ్వడంతో.. బీఆర్ఎస్ అభ్యర్థికే చంద్రబాబు మద్దతు ప్రకటిస్తారా? అనేచర్చ సాగుతున్నది. మరోవైపు, బీజేపీ కూడా అభ్యర్థిపై కసరత్తు చేస్తోన్న నేపథ్యంలో.. ఎన్డీఏ భాగస్వామిగా ఉన్న చంద్రబాబు.. ఇక్కడ బీజేపీ వైపు మొగ్గు చూపుతారా? అనే మరో చర్చ కూడా సాగుతుంది.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్ స్తబ్ధతకు కారణాలివే

మొదటిపేజీ తరువాయి

చర్యలే కారణమంటూ వస్తున్న ఆరోపణలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. ఈ ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. మార్కెట్ నెమ్మదించడానికి అసలు కారణాలు వేరే ఉన్నాయని, కేవలం తమపై నిందలు మోపడం సరికాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో డిమాండ్‌కు మించి సప్లై ఉందని రంగనాథ్ వివరించారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న ప్రాజెక్టులు, ఫ్లాట్లు భారీ సంఖ్యలో పేరుకుపోయాయని (అన్‌సోల్డ్ ఇన్వెంటరీ), ఇది మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. దీనికి తోడు, అమెరికా వంటి విదేశాల నుంచి వచ్చే ఎన్నారై పెట్టుబడులు, రెమిటెన్స్‌లు గణనీయంగా తగ్గిపోయాయని ఆయన పేర్కొన్నారు. పెరుగుతున్న వడ్డీ రేట్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కారణంగా ఉద్యోగాలు పోతాయనే భయాలు కూడా కొనుగోలు శక్తిని దెబ్బతీస్తున్నాయని విశ్లేషించారు. "ప్రతిదానికీ హైడ్రాను బాధ్యుల్ని చేయడం ఒక బ్లేమ్ గేమ్‌లా మారింది. మా కార్యకలాపాలు కేవలం హైదరాబాద్‌కే పరిమితం. మరి ఖమ్మం, వరంగల్ వంటి నగరాల్లో కూడా రియల్ ఎస్టేట్ ఎందుకు నెమ్మదించింది? ఈ అంశాన్ని కూడా గమనించాలి కదా?" అని రంగనాథ్ ప్రశ్నించారు. అసలు రియల్ ఎస్టేట్ అంటే చదరపు అడుగుకు రూ.10,000, రూ.15,000 ధరలు పెరగడం కాదని, సామాన్యుడికి, మధ్యతరగతి వారికి సొంతింటి కలను అందుబాటులోకి తీసుకురావడమే నిజమైన అభివృద్ధని ఆయన అభిప్రాయపడ్డారు. అందరికీ ఇళ్లు అందుబాటులోకి వచ్చినప్పుడే అది నిజమైన రియల్ ఎస్టేట్ అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో అమృతప్రణయ్ ప్రేమ పెళ్లికి సంబంధించి ప్రణయ్ హత్య కేసు దర్యాప్తు సమయంలో కూడా సోషల్ మీడియాలో తనపై ఇలాగే ఎన్నో ఆరోపణలు వచ్చాయని, అయినా వృత్తిధర్మాన్ని విడిచిపెట్టలేదని రంగనాథ్ గుర్తుచేశారు. బాహ్య ఒత్తిళ్లకు తలొగ్గకుండా లక్ష్యంపైనే దృష్టి పెడితే వాస్తవాలు వాటంతటవే బయటకు వస్తాయని ఆయన అన్నారు.







# ఎన్నికల నియమావళి పాటించాలి

- **తహశీల్దార్ చంద్రశేఖర్‌రావు, ఇంచార్జ్ ఎంపీడీవో గపూర్ ఖాద్రి**

**దౌల్తాబాద్, అక్టోబర్ 7 (ప్రజాస్వరం):**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని తహశీల్దార్ చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ చంద్రశేఖర రావు, ఇంచార్జ్ ఎంపీడీవో గపూర్ ఖాద్రి మాట్లాడుతూ, “ఎన్నికల సమయంలో ప్రతి అభ్యర్థి, కార్యకర్త మరియు పార్టీ ప్రతినిధులు నియమావళిని కచ్చితంగా పాటించాలి. ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో సాగేందుకు అధికారులు, రాజకీయ నాయకులు సమన్వయంతో ముందుకు రావాలి” అని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల గౌరవం చూపే విధంగా ప్రతిఒక్కరూ చట్టపరమైన పరిమితుల్లో ఉండి ప్రవర్తించాలని ఆయన సూచించారు. ఎన్నికల ప్రచారంలో డబ్బు, మద్యం పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పోస్టర్లు, బ్యానర్లు, వాహనాల వినియోగం, ప్రచార సమయాల విషయంలో ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో అధికార యంత్రాంగం పక్షపాతరహితంగా వ్యవహరిస్తుందని, ఏవైనా ఫిర్యాదులు ఉంటే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు తావు ఇవ్వకుండా ప్రతి పార్టీ బాధ్యతగా వ్యవహరించాలని తహశీల్దార్ చంద్రశేఖర్‌రావు ఆహ్వానించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పోలీస్ అధికారులు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జస్టిస్ గవాయ్‌పై దాడి హేయనీయం

- **న్యాయవ్యవస్థ గౌరవాన్ని అవమానపరచే చర్య**
- **టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి గణేష్ పంచమి**

**దౌల్తాబాద్, అక్టోబర్ 7 (ప్రజాస్వరం) :**



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి గణేష్ పంచమి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన దేశ న్యాయవ్యవస్థ గౌరవాన్ని అవమానపరచే దుష్ట చర్యగా ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులను కల్పించిన పత్రం అని, ఆ రాజ్యాంగాన్ని కాపాడే ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడం దేశ ప్రజాస్వామ్యానికి మచ్చతెచ్చే సంఘటన అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. “న్యాయవ్యవస్థపై దాడి అనేది ప్రజాస్వామ్య పునాదులపై దాడితో సమానమని” గణేష్ పంచమి స్పష్టం చేశారు. దేశానికి మార్గదర్శకులైన న్యాయమూర్తుల భద్రతకు భంగం కలిగించడం అసహ్యకరమైన చర్య అని పేర్కొంటూ, ఇలాంటి సంఘటనలను కఠినంగా అణచివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. “దేశ గౌరవం, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠ దెబ్బతినేలా చేసే ప్రయత్నాలను ఏ మాత్రం సహించరాదు” అని హెచ్చరించారు. భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ దేశానికి ఇచ్చిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సోదరభావం వంటి విలువలను ప్రసాదించిందని గుర్తుచేశారు. “ఆ విలువలను చెరిపివేయాలనే ప్రయత్నాలను ప్రజలు అడ్డుకోవాలి” అని పిలుపునిచ్చారు. భారత ప్రజాస్వామ్యం బలహీనపడకుండా ఉండాలంటే ప్రతి పౌరుడు రాజ్యాంగ విలువల పట్ల అప్రమత్తంగా ఉండాలని గణేష్ పంచమి స్పష్టం చేశారు. “న్యాయం, సత్యం, రాజ్యాంగ పరిరక్షణ — ఈ మూడు విలువలతోనే దేశం ముందుకు సాగాలి” అని అన్నారు.

# ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు






**మెదక్, అక్టోబర్ 07 (ప్రజా స్వరం) :**

మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు సందర్భంగా మంగళవారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి తొలుత దొంగగా జీవనం సాగించినప్పటికీ, తన గురువు గారి బోధనల ద్వారా ప్రేరణ పొంది, పశ్చాత్తాపంతో సద్గుణమార్గం వైపు మళ్లారు. ఆత్మశోధన ద్వారా మహానుభావుడిగా మారి, మనందరికీ ఆదర్శప్రాయమైన రామాయణం అనే గ్రంథాన్ని రచించారని అన్నారు. మన మనసు మారితే ఎవరైనా మహానుభావులుగా ఎదగగలరని తెలిపారు. ఆయన చూపిన సత్యం, ధర్మం, నీతి మార్గాల్లో నడుచుకుంటూ సమాజానికి సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు సుభాష్ చంద్రబోస్, రంగనాయక్, సీఐలు మధుసూదన్ గౌడ్, సందీప్ రెడ్డి, ఆర్ఐలు రామకృష్ణ, శైలేందర్, ఏఓ మణి పాల్గొన్నారు.

# వాల్మీకి జీవితం.. అందరికీ ఆదర్శం



- **ఇతిహాసాల్లో మొదటిది రామాయణం**
- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్, అక్టోబర్ 07 (ప్రజా స్వరం) :**

వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ,అదనపు కలెక్టర్ నగేష్ బీసీ సంక్షేమ శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచం ఉన్నంత వరకు రామాయణ, వాల్మీకి చరిత్ర ఉంటుందని, ఇతిహాసాల్లో మొదటిది రామాయణమని వాల్మీకి మహర్షి చూపిన బాటన ప్రతి ఒక్కరూ నడిచి నీతి నిజాయితీతో జీవించాలన్నారు. మానవతా విలువలను, ఉన్నతమైన అంశాలను రామాయణం అడుగడుగునా మనకు బోధిస్తుందని, అటువంటి గొప్ప కావ్యాన్న రచించిన మహర్షి వాల్మీకి జయంతిని జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు నాయకులు పాల్గొన్నారు.



# వృద్ధ ఆశ్రమం సందర్శన

**మెదక్, అక్టోబర్ 07 (ప్రజా స్వరం) :**

మెదక్ పట్టణం సిఎస్ఐ చర్చి ఆవరణలో ఉన్న సంధ్య నిలయం వృద్ధ ఆశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఆర్.ఎం. సుభవల్లి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి వృద్ధులకు అందుతున్న వసతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లాడ్స్ డిప్యూటీ చీఫ్ రామశర్మ, ప్యానల్ లాయర్ దుర్గా రెడ్డి, పాస్టర్ స్టువర్డ్ ఫ్రాంక్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

# వరి పంటను పరిశీలించిన జిల్లా నోడల్ అధికారి రాహుల్




**మెదక్ అక్టోబర్ 07 (ప్రజా స్వరం) :**

నాణ్యమైన విత్తనము రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా మెదక్ పట్టణం దాయర లోని వరి పంటకి సంబంధించి ఎంటీయూ 1010 రకాన్ని జిల్లా నోడల్ అధికారి శాస్త్రవేత్త కే. రాహుల్ విశ్వకర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రైతులతో మాట్లాడుతూ ఈ నాణ్యమైన విత్తనంతో పంటలు సమృద్ధిగా పండించి తద్వారా దేశ సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలని మహోత్తర లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ప్రతి మండలంలో ప్రతి రెవెన్యూ గ్రామానికి విత్తన కిట్లు అందజేయడం జరిగిందన్నారు. ఈ నాణ్యమైన విత్తనాలను రైతులు తమ పొలాల్లో పండించి తద్వారా పండిన విత్తనాల్ని ఇతర రైతులకు చేరవేసేలా చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని, ఇది విత్తన లభ్యతను పెంచడమే కాకుండా నాణ్యమైన విత్తనంపై అవగాహన కల్పించుటకు దోహదపడుతుందన్నారు, అలాగే రైతులకు అవసరమైన సూచనలు, సమస్యలకు సత్వరమే పరిష్కారం లభిస్తుందని తెలిపారు. వరి పంటలో సమగ్ర చీడపీడల యాజమాన్యం, ఈ మాసంలో చేపట్టాల్సిన వ్యవసాయ పనుల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సిహెచ్ రాజశేఖర్, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం యంగ్ ప్రొఫెషనల్ 1 ఎస్. శ్రీకాంత్, రైతులు గందె రాములు, జుట్టు శ్రీకాంత్, షేక్ మక్తార్ తదితరులు పాల్గొన్నారు.

# బిసి బిల్లుపై సుప్రీం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- **రిజర్వేషన్ అమలుపై కాంగ్రెస్ తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి**
- **జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్**

**గజ్వేల్ అక్టోబర్ 07 (ప్రజా స్వరం) :**

42 శాతం రిజర్వేషన్ అంశంపై సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 60 శాతానికి పైగా బలహీన వర్గాల జనాభా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం జాగృతి ఉద్యమించి బలహీన వర్గాల ప్రజల్లో కదలిక తెచ్చినట్లు గుర్తు చేశారు. ఈ క్రమంలో వారి నుండి సంపూర్ణ మద్దతు దక్కుతున్నట్లు తెలిపారు. అయితే సుప్రీంకోర్టు నిర్ణయంలో కాంగ్రెస్ తనవంతు పాత్ర పోషించగా, బిజెపి మాత్రం ద్వంద నీతి ప్రదర్శిస్తూ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు. ముఖ్యంగా 42 శాతం రిజర్వేషన్ పై బిజెపి పార్టీ చీఫ్ మాట్లాడిన తీరు సిగ్గుచేటుగా ఉందని, మద్దతు ఇస్తున్నట్లు ప్రకటిస్తూనే పార్లమెంటులో స్పందన లేకపోవడం, గవర్నర్ వద్ద బిల్లు పెండింగులో ఉండడం ద్వారా బిజెపి కుటిల యత్నాలు ప్రజలు గ్రహిస్తున్నట్లు చెప్పారు. కాగా 42 శాతం రిజర్వేషన్ పై ఈనెల 8వ తేదీన హైకోర్టులో విచారణ జరగుతున్నందున కాంగ్రెస్ తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. అలాగే పేద ప్రజలపై భారము మోపకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన బస్సు చార్జీల నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం అన్ని పార్టీలు మద్దతు ప్రకటించాలని, లేనిపక్షంలో ప్రజలే వారికి తగిన బుద్ధి చెప్తారని వివరించారు.





# కాంగ్రెస్ నేత నారాయణ రెడ్డికి సతివియోగం

- **పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు విఠల్ రెడ్డి**

**పెద్దేముల్, అక్టోబర్ 07(ప్రజాస్వరం):**

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ గాజీపూర్ నారాయణరెడ్డి సతీమణి మానెమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న తాండూరు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విఠల్ రెడ్డి గాజీపూర్ గ్రామానికి వెళ్లి మానేమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానేమ్మ మృతి పట్ల సంతాపం తెలిపారు. ఈ మేరకు నారాయణరెడ్డితో పాటుగా కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఆయన వెంట స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన







**మెదక్, అక్టోబర్ 07 (ప్రజా స్వరం) :**
ఎంపిటిసి, జడ్పిటిసి, సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో మెదక్ జిల్లా కేంద్రంలోని గురుకుల పాఠశాల /జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూములు భద్రత, సీసీ కెమెరా, పోలీస్ బందోబస్తు, ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగంపై ఆయన ఆరా తీశారు. ఎన్నికల సమయంలో ఎటువంటి లోపాలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచిస్తూ, లెక్కింపు రూముల్లో విద్యుత్, లైటింగ్, భద్రత వంటి అన్ని సౌకర్యాలు సక్రమంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల అధికారుల అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సౌకర్యాలు కల్పన పై ధ్రువీకరణ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జెడ్పీ సీఈవో ఎల్లయ్య, మెదక్ ఆర్డీవో రమాదేవి, ఎమ్మార్వో లక్ష్మణ్ బాబు తదితరులు ఉన్నారు



# పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి**

**శామీర్‌పేట, అక్టోబర్ 07(ప్రజాస్వరం) :**
అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆల్వాల్‌లోని ఐటీఐ కాలేజీలో నూతనంగా ప్రారంభించిన ఏటీసీ సెంటర్ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏటిసి సెంటర్ లో పెండింగ్ లో ఉన్న ఏసీ ఫిట్టింగ్ కంప్యూటర్ ఇన్స్టాలేషన్ వంటి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు సెంటర్లోని మిషనరీని తరగతి గదులను పరిశీలించారు మొత్తము ఎంతమంది విద్యార్థులు ఉన్నారని ఎన్ని ట్రేడ్లు ఉన్నాయని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్క ట్రేడ్ లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని వారికి సరిపడా బోధన సిబ్బంది ఉన్నారా అని ఆరా తీశారు. టెక్నాలజీ కోర్సులలో ప్రాక్టికల్ థియరీ క్లాసులు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. బోధన సిబ్బంది సమాధానం ఇస్తూ వర్క్ షాప్ రూఫ్ లీకేజ్ అవుతుందని పారిశుద్ధ్య సిబ్బంది కొరత ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ పర్యటనలో డివో శేఖర్ రెడ్డి, సూపరింటెండెంట్ శైలజ బోధన సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ

**శామీర్‌పేట, అక్టోబర్ 7 (ప్రజాస్వరం) :**
శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేటలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద శామీర్ పేటకు చెందిన గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా శామీర్ పేట కు చెందిన దూడల వంశీ గౌడ్, దూడల యాదగిరి గౌడ్ వారి కుటుంబ సభ్యులు 25 కేజీల బియ్యం అందజేయగా శామీర్ పేటకు చెందిన డీజే వెంకటేష్ గౌడ్ అన్నదానానికి సహకరించారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# పత్తి పంట రైతులకు జీవనధారం

- **భారత నవనిర్మాణ సంస్థ కో-ఆర్డినేటర్ దాతర్ పల్లి భాస్కర్**




**దౌల్తాబాద్ అక్టోబర్ 7 ( ప్రజాస్వరం)**
పత్తి పంట ప్రపంచ వ్యాప్తంగా లక్షలాదిమంది రైతులకు జీవనాధారం ఇస్తుందని వ్యవసాయం నుంచి వస్త్ర పరిశ్రమ వరకు అనేక రంగాలలో ఉపాధి కల్పిస్తుందని పత్తి పంటను తెల్ల బంగారమని అంటారని భారత నవ నిర్మాణ సంస్థ కో ఆర్డినేటర్ దాతర్ పల్లి భాస్కర్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం రామారం గ్రామంలో ప్రపంచ పత్తి దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 7న ప్రపంచ పత్తి దినోత్సవం జరుపుకోవడం ద్వారా పత్తి పంట యొక్క ప్రాముఖ్యతను గుర్తుచేసుకుంటామన్నారు.ప్రపంచ వాణిజ్య సంస్థ 2019 లో మొదటిసారి ప్రపంచ పత్తి దినోత్సవం ప్రారంభించింది. ఈ దినోత్సవం ఉద్దేశ్యం పత్తి యొక్క ప్రాధాన్యతను ప్రపంచానికి తెలియజేయడం, పత్తి రైతులను శక్తివంతం చేస్తు, పత్తి ఉత్పత్తిని సుస్థిరంగా అభివృద్ధి చేయడమన్నారు. భారతదేశం ప్రపంచంలో అతి పెద్ద పత్తి ఉత్పత్తి దేశాల్లో ఒకటి. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎక్కువగా పత్తి పండించబడుతోందన్నారు.పత్తి పంట వలన మనకు వస్త్రాలు మాత్రమే కాకుండా, పత్తి విత్తన నూనె, పశువుల ఆహారం వంటి అనేక ఉత్పత్తులు కూడా లభిస్తున్నాయి. ముఖ్యంగా పత్తి సహజమైన, బయోడిగ్రేడబుల్ అయిన పంట కావడం వల్ల పర్యావరణానికి మేలు చేస్తుంది.ఈ కార్యక్రమంలో పియు మేనేజర్ కల్పన, ఫీల్డ్ ఫెసిలిటేటర్స్,కరుణాకర్, శ్రీకాంత్, వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- **తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల బృందం టీం లీడర్ ఆస రామారావు**



**దౌల్తాబాద్ అక్టోబర్ 7 (ప్రజా స్వరం) :**
సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఆన్లైన్ గేమ్స్ పేరుతో వివిధ రకాల ఆఫర్స్ తో ప్రజలను సైబర్ నేరగాళ్లు మోసం చేసి డబ్బులు కాజేస్తారని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం టీమ్ లీడర్ ఆశ రామారావు అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో ఓటు హక్కు వినియోగం, పచ్చదనం పరిసరాల పరిశుభ్రత, ట్రాఫిక్ నియమాలు, డ్రగ్స్, సైబర్ నేరాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల పై పాట మాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ హైమావతి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బిజ్జూరి రవి కుమార్ ఆదేశాల మేరకు రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో ఓటు హక్కు వినియోగం, పచ్చదనం పరిసరాల పరిశుభ్రత, డ్రగ్స్ నియంత్రణ, వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకునే జాగ్రత్తలు, ప్లాస్టిక్ నిషేధం, హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని వీటితోపాటు ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాల పైన ఆటపాటలతో ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించడమైనది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వరుసగా కురుస్తున్న వర్షాలతో గ్రామాలలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని ప్రజలందరూ ఎవరికి వారు స్వచ్ఛందంగా పారిశుద్ధ్యం పరిశుభ్రత కోసం సహకరించాలన్నారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో రాజ్యాంగం ద్వారా బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ అంశాలపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం చీకోడు నర్సింలు, బిట్ల ఎల్లం, తుమ్మల ఎల్లం, శేఖర్ పాల్గొన్నారు.

# మానెమ్మ మృతి బాధాకరం

- **తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**పెద్దేముల్, అక్టోబర్ 07(ప్రజాస్వరం) :**
మానెమ్మ మృతి అత్యంత బాధాకరమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండల పరిధిలోని గాజీపూర్ గ్రామానికి చెందిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి భార్య మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి నారాయణ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు మానెమ్మ పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళి గౌడ్, నాయకులు లాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో

# అలయ్ బలయ్

**శామీర్ పేట అక్టోబర్ 07(ప్రజాస్వరం) :**
నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం దసరా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నాయి సోదరులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈటెల రాజేందర్, ఎంపీ మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, మహేష్, మల్లేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగుల శ్రీనివాస్ నాయుడు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సత్యం, శామీర్ పేట మండల అధ్యక్షులు బట్టు గోపాల్ నాయక్, గౌరవ అధ్యక్షులు యు రమేష్ నాయక్, కోశాధికారి పసుపుల యాదగిరి నాయి, కార్యవర్గ కమిటీ సభ్యులు డి బిక్షపతి నాయక్, డి ఎల్లాస్ నాయి, బి రాకేష్ నాయి, బి ఓం దాస్ నాయి, డి భరత్ నాయి, సిహెచ్ పవన్ నాయి, బాబు నాయి, వెంకటేష్ నాయక్, రవి నాయి, టి యాదగిరి నాయి, జై నాగేష్ నాయి, జి ప్రభాకర్ నాయక్, పి సంపత్ నాయక్, జి. గిరినాయి, జి వెంకటేష్, జి నాగేష్ నాయుడు, డి నాగరాజు సిహెచ్ ప్రసాద్ నాయక్, ఎస్ కార్తీక్ నాయక్, నాయి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

- **మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్**
- **పార్టీ పటిష్టతకు కృషి చేస్తా**
- **నాకు బాధ్యతలు అప్పగించిన అదినాయకత్వానికి కృతజ్ఞతలు**
- **మున్సిపాలిటీ నూతన అధ్యక్షుడు తుంకి రమేష్**

**శామీర్ పేట్, అక్టోబర్ 07, (ప్రజాస్వరం) :**

ఆలియాబాద్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మంగళవారం అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా ఎన్నికైన మజీద్ పూర్ గ్రామానికి చెందిన తుంకి రమేష్‌కు అభినందనలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి నిరుపేదకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం అమలుపరుస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజలకు చేరే విదంగా మున్సిపల్ అధ్యక్షుడు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**పార్టీ పటిష్టతకు కృషి చేస్తా**

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆలియాబాద్ మున్సిపాలిటీ నూతన అధ్యక్షుడు తుంకి రమేష్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని తనను నియమించిన పార్టీ అధినాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రాబోయే మున్సిపల్ ఎన్నికల ముందు తనకు పార్టీ అధ్యక్ష పదవిని నియమించడం తనకు ఒక గొప్ప అవకాశం అని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్త ఎంటో చూపించాల్సిన అవశ్యకత ఉందన్నారు. మున్సిపాలిటీ అధ్యక్ష పదవిని నియమించిన ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మలిపెద్ది సుదీర్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ తో పాటు ఇతర అదినాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తన శక్తి మేరకు పార్టీ పటిష్టతకు, రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే మాజి ఎమ్మెల్యే మలిపెద్ది సుదీర్ రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవు నూతన అధ్యక్షుడు తుంకి రమేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ డైరెక్టర్ తుంకి భిక్షపతి, ముదుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోసకాయల.వెంకటేష్, ముదుచింతలపల్లి మాజీ సర్పంచ్ బాల్ నర్సింహ, నెమురి విష్ణు గౌడ్, చట్లపల్లి నర్సింగ రావు, యూత్ కాంగ్రెస్ శ్రీకర్ రెడ్డి, మేడి మల్లేష్, భూమిరెడ్డి నవీన్ రెడ్డి, మునికొండ నవీన్, లింగోళ్ల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



# బార్ కౌన్సిలింగ్ నుండి సస్పెండ్ చేయాలి



- **రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్ట రాజు**

**దౌల్తాబాద్ అక్టోబర్ 7 (ప్రజాస్వరం) :**

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ పై లాయర్ రాకేష్ కిషోర్ న బార్ కౌన్సిలింగ్ శాశ్వతంగా సస్పెండ్ చేసి కఠినంగా శిక్షించాలని రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్ట రాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిజెఐ గవాయ్ పై దాడి చేయడమంటే రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ లౌకిక పునాదిని కూల్చివేసి, న్యాయవ్యవస్థను మతపరమైన ఆటబొమ్మగా మార్చడానికి ప్రయత్నించే శక్తులకు ఇది ఒక పరాకాష్ఠన్నారు.అత్యున్నత న్యాయస్థానంపై జరిగిన దాడి కేవలం ఒక సంఘటన కాదు, ఇది భారత రాజ్యాంగంపై మత వాదుల యుద్ధ ప్రకటన అన్నారు. న్యాయస్థానం దేవుడి కోట కాదు, న్యాయమూర్తి మత గురువు కాదు.లౌకిక పునాదిపై దాడి మన రాజ్యాంగం ప్రకారం, రాష్ట్రం ఏ మతానికీ అనుకూలంగా ఉండదు, వ్యతిరేకంగానూ ఉండదు. ఖజురాహో ఆలయ విగ్రహం పునరుద్ధరణ పిటిషన్‌ను సిజెఐ గవాయ్ కొట్టివేయడం ఈ లౌకిక సూత్రానికి నిదర్శనం. ఆ సమస్య ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా చట్ట పరిధిలోకి వస్తుందని చెప్పడం న్యాయపరమైన విధి. న్యాయమూర్తి చేసిన ఆ రాజ్యాంగబద్ధమైన వ్యాఖ్యను విష్ణుమూర్తిని అడగండని వక్రీకరించి ప్రచారం చేయడం జరిగింది.న్యాయమూర్తినే భయ పెట్టడం అంటే అది ప్రజాస్వామ్యానికి పతనమన్నారు. రాకేష్ కిషోర్ సిజెఐపై తన షూ తో దాడి చేసి సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఉపేక్షించేది లేదు అంటూ వ్యాఖ్యలు చేయడు.దేశ అత్యున్నత న్యాయస్థానంలో కుల మత జాతి వర్గ భేదం లేకుండా ప్రవర్తించాల్సింది పోయి సనాతన ధర్మం అంటూ మతపరమైన వ్యాఖ్యలు ప్రస్తావించడం సిగ్గుచేటు అన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికే రక్షణ లేకపోతే దేశంలో నివసిస్తున్న సామాన్య ప్రజల పరిస్థితి ఏంటో ఆలోచించుకోవాలన్నారు. ఇలాంటి చర్యలు దేశానికి ప్రమాదకరమని ప్రపంచ దేశంలో భారతదేశం విలువ తగ్గించే విధంగా ఈ చర్యలు ఉన్నాయన్నారు. కాబట్టి ఈ దుర్ఘటనకు పాల్పడిన లాయర్ రాకేష్ కిషోర్ ను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



# మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

- **జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహణ**

**వికారాబాద్, అక్టోబర్ 7(ప్రజా స్వరం) :**

మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరెట్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.. పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "మహర్షి వాల్మీకి మన దేశానికి ఆదర్శప్రాయమైన కవి, ఆధ్యాత్మిక గురువుగా నిలిచారు. ఆయన రామాయణాన్ని రచించి సత్యం, ధర్మం, న్యాయం, నిష్కామ సేవ వంటి విలువలను సమాజానికి చాటిచెప్పారు. ఆయన చూపిన మార్గంలో నడిచి ప్రతి ఒక్కరూ నిజాయితీ, నిబద్ధతతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్స్ చౌదరి, డి ఆర్ ఓ మంగీ లాల్, బి సి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# వికారాబాద్ కలెక్టరేట్‌లో
# కొమురం భీమ్ వర్ధంతి





**వికారాబాద్, అక్టోబర్ 7 (ప్రజా స్వరం) :**

కొమురం భీమ్ వర్ధంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు ఆయన చిత్ర ఫటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్. మంగళవారం ఐడీఓసీ నందు ఏర్పాటు చేసిన కొమురం భీమ్ 65 వ వర్ధంతి సందర్భంగా అయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అరిపించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్స్ చౌదరి, డి ఆర్ ఓ మంగీ లాల్, డి టి డి ఓ కమలాకర్ రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


# మున్సిపల్ కార్యాలయంలో
# వాల్మీకి జయంతి వేడుకలు

**జవహర్ నగర్, సెప్టెంబర్ 7,(ప్రజాస్వరం):**

వాల్మీకి మహర్షి జయంతి పురస్కరించుకొని మంగళవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ ఎం వసంత పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. శ్రీరాముని దివ్య చరిత్రను కావ్య రూపంలో అందించిన మహా కవి వాల్మీకి మహర్షి అని ఆమె అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ డి ఇ మాధవ చారి, మునిసిపల్ ఆర్ ఓ వెంకటేశం,జూనియర్ అసిస్టెంట్ లు, వార్డు ఆఫీసర్స్ అకౌంటెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రభుత్వ గురుకులాల్లో నాణ్యమైన విద్య





- **ఫ్రీ ఎంబీబీఎస్ సీటు సాధించిన ఆదిత్య వర్ధన్ ను అభినందించిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**తాండూరు, అక్టోబర్ 7(ప్రజా స్వరం):**

ప్రభుత్వ గురుకులాల్లో చదివి ఈ మధ్యే జరిగిన నీట్ లో ఉత్తమ ర్యాంక్ సాధించి కామినేని మెడికల్ కళాశాలలో ఫ్రీ ఎంబీబీఎస్ సీటు సాధించిన తాండూరు నియోజకవర్గం యాలాల మండలం బండ మీది పల్లి గ్రామానికి చెందిన బషీరాబాద్ సాక్షి విలేకరి నర్సిములు, పద్మ దంపతుల కొడుకు ఆదిత్య వర్ధన్ ను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శాలువ పూల మాలతో ఘనంగా సన్మానించారు. మంగళవారం తాండూరు పట్టణంలోని వారి నివాసానికి ఎమ్మెల్యే కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్, ధారా సింగ్, మురళి కృష్ణ గౌడ్, మాధవ రెడ్డి, బాల్ రెడ్డి , నర్సిములు, చందర్, ఉదయ్ భాస్కర్ తో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా ఆదిత్యతో ముచ్చటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ గురుకులాల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని చెప్పడానికి ఆదిత్య సాధించిన ఎంబీబీఎస్ సీటు నిదర్శనం అన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య తల్లిదండ్రులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



# కాంగ్రెస్ పార్టీ మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటుంది

## బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు మెతుకు ఆనంద్




**వికారాబాద్, అక్టోబర్ 7(ప్రజా స్వరం):**

వికారాబాద్ జిల్లా బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ వికారాబాద్ పట్టణం ఎన్నెపల్లి లోని బీ ఆర్ ఎస్ భవన్ పార్టీ కార్యాలయం పార్టీ పట్టణ మైనారిటీ నాయకులతో మంగళ వారం సమావేశం అయ్యారు. సమావేశంలో భాగంగా అనేక విషయాలు చర్చించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ముస్లిం, మైనార్టీలను కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాలకు మాత్రమే వాడుకుంటుంది, వారికి మెరుగైన జీవనస్థితిగతులను కల్పించడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమయ్యింది అని అన్నారు. గతంలో కేసీఆర్ పాలనలో మైనారిటీల అభ్యున్నతికి అనేక సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు అమలు జరిగాయి. మైనారిటీ యువతకు స్వయం ఉపాధి కోసం అందించే రుణాల సబ్సిడీని 50 శాతం నుంచి 80 శాతానికి పెంచి, ముస్లిం మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ లాంటి కార్యక్రమాలు చేపట్టి వారి ప్రగతికి దోహదం చేశారు అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి, నిరుపేదలైన విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించిన ఘనత కేసీఆర్ కు మాత్రమే దక్కుతుందని అన్నారు. కేసీఆర్ ముందు చూపుతో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు అప్‌గ్రేడ్ చేస్తూ కాలేజీలు కూడా ఏర్పాటు చేశారు అని తెలిపారు.

**మైనారిటీ డిక్లరేషన్, మంత్రి పదవి ఎక్కడ?**

ఎన్నికల ముందు మైనారిటీ ఓట్ల కోసం మైనారిటీ డిక్లరేషన్‌ను ప్రకటించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక డిక్లరేషన్ ఊసెత్తడం లేదు. రాష్ట్ర క్యాబినెట్‌లో ఒక్క మైనారిటీకి కూడా స్థానం కల్పించలేదు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసేవన్నీ మోసపూరిత వాగ్దానాలే అని, నామినేటెడ్ పదవుల భర్తీలో కూడా మైనారిటీలకు అవకాశం ఇవ్వలేదు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ముస్లిం, మైనారిటీలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ పట్టణ పార్టీ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ అనంత్ రెడ్డి, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, పట్టణ మైనారిటీ విభాగం అధ్యక్షులు *ముర్తుజా ఆలీ, పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షులు సుభాన్ రెడ్డి నాయకులు ఫరీద్, ఇస్మాయిల్, షఫీ, దత్తు తదితరులు పాల్గొన్నారు.



## తాండూరులో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

**తాండూరు, అక్టోబర్ 7(ప్రజా స్వరం) :**

తాండూరు మున్సిపల్ కార్యాలయంలో మంగళ వారం మున్సిపల్ కమిషనర్ యాదగిరి ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, ఇన్చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఆర్ ఐ రాములు, వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి పెద్ద ఎత్తున చేరికలు

**తాండూరు, అక్టోబర్ 7(ప్రజా స్వరం) :**

తాండూరు మండలం చెన్గేష్ పూర్, కోనాపూర్ గ్రామాల నుండి బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి దాదాపు 200 మంది నాయకులు, కార్యకర్తలు చేరారు. వారికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



### అక్రమంగా మద్యం విక్రయిస్తున్న షాప్ పై

## టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

- **76.985 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం**




**మెదక్ అక్టోబర్ 07 (ప్రజా స్వరం) :**

మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మనగర్ గ్రామంలోని రవీందర్ కిరాణా షాప్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు నమ్మదగిన సమాచారం మేరకు మెదక్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. దాడి సమయంలో కిరాణా షాప్‌లో విక్రయిస్తున్న మొత్తం 76.985 లీటర్ల అక్రమ మద్యం ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన మద్యం, నిందితులను మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ కు అప్పగించి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అక్రమ మద్యం విక్రయాలు, రవాణా, నిల్వ చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని, ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి సహకరించాలని తెలిపారు.

# వీడ్కోలు మ్యాచ్ ఆడకుండానే వెళ్ళిపోయిన 11 మంది భారత క్రికెట్ దిగ్గజాలు వీరే!

- వీడ్కోలు మ్యాచ్ ఆడకుండానే రిటైరైన భారత క్రికెట్ దిగ్గజాలు
- జాబితాలో ధోనీ, యువరాజ్, ద్రావిడ్, సెహ్వాగ్ వంటి స్టార్లు
- అభిమానులకు తీరని లోటుగా మిగిలిపోయిన ఆఖరి మ్యాచ్

స్పోర్ట్స్, ప్రజాస్వరం













భారత క్రికెట్ జట్టులో దిగ్గజ ఆటగాళ్లుగా వెలుగొందుతున్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల కెరీర్ చివరి దశకు చేరుకుంటున్న వేళ, ఒక ఆసక్తికరమైన చర్చ మళ్లీ తెరపైకి వస్తోంది. దేశానికి ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన ఎందరో స్టార్ క్రికెటర్లు, కనీసం ఒక్క వీడ్కోలు మ్యాచ్ కూడా ఆడకుండానే అంతర్జాతీయ క్రికెట్ నుంచి నిష్క్రమించడం అభిమానులను ఎప్పుడూ వేధించే విషయమే. మైదానంలో తమ హీరోలను ఆఖరిసారిగా చూడాలన్న కోరిక తీరకుండానే, వారు ఆటకు వీడ్కోలు పలకడం ఒకరకమైన వెలితిని మిగిల్చింది.

ఈ జాబితాలో ముందుగా చెప్పుకోవాల్సింది కెప్టెన్ కూల్ మహేంద్ర సింగ్ ధోనీ గురించే. 2020 ఆగస్టులో కరోనా లాక్‌డౌన్ సమయంలో ధోనీ హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. రెండు ప్రపంచకప్‌లు అందించిన కెప్టెన్‌కు ఘనమైన వీడ్కోలు దక్కలేదన్న బాధ అభిమానుల్లో ఇప్పటికీ ఉంది. అలాగే, 2011 ప్రపంచకప్ హీరో యువరాజ్ సింగ్ కూడా 2019లో ఆటకు గుడ్ బై చెప్పాడు. తనకు ఫేర్‌వెల్ మ్యాచ్ ఆడే అవకాశం వచ్చినా, వద్దని చెప్పడం గమనార్హం. 'ది వాల్' రాహుల్ ద్రావిడ్, 'వెరీ వెరీ స్పెషల్' వీవీఎస్ లక్ష్మణ్ వంటి వారు కూడా 2012లో ఎలాంటి హడావుడి లేకుండా మీడియా సమావేశం ద్వారానే తమ రిటైర్మెంట్ నిర్ణయాలను వెల్లడించారు.

విధ్వంసకర ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ 2013లో జట్టుకు దూరమై, 2015లో అధికారికంగా రిటైరయ్యాడు. 2007 టీ20, 2011 వన్డే ప్రపంచకప్‌ల విజయంలో కీలకపాత్ర పోషించిన గౌతమ్ గంభీర్ కూడా 2018లో ఎలాంటి వీడ్కోలు మ్యాచ్ లేకుండానే తప్పుకున్నాడు. బౌలింగ్ దిగ్గజాలైన అనిల్ కుంబ్లే (2008), జహీర్ ఖాన్ (2015), హర్భజన్ సింగ్ (2021) కూడా ఇదే బాటలో నడిచారు. గాయాలు, జట్టులో మార్పుల కారణంగా వీరికి మైదానంలో ఘనమైన వీడ్కోలు దక్కలేదు. ఇక, అత్యుత్తమ ఫీల్డర్, ఫినిషర్‌గా పేరుగాంచిన సురేశ్ రైనా సోషల్ మీడియా వేదికగా తన రిటైర్మెంట్‌ను ప్రకటించాడు.

ఇటీవల, 2024 ఆగస్టులో ఐసీసీ టోర్నీల హీరోగా పేరు తెచ్చుకున్న శిఖర్ ధావన్ కూడా ఈ జాబితాలో చేరాడు. ఇలా ఎందరో దిగ్గజాలు వీడ్కోలు మ్యాచ్ ఆడకపోయినా, భారత క్రికెట్‌కు వారు అందించిన సేవలు, సాధించిన విజయాలు మాత్రం అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి.



## భారత్‌పాక్ మ్యాచ్‌లు ఆపడం సాధ్యమేనా?.. అసలు విషయం చెప్పిన బీసీసీఐ

- భారత్-పాక్ మ్యాచ్‌ల రద్దు డిమాండ్‌పై స్పందించిన బీసీసీఐ
- ఈ విషయంపై మాట్లాడటం తేలికేనన్న బీసీసీఐ అధికారి
- స్పాన్సర్లు, బ్రాడ్‌కాస్టర్లు ఒప్పుకుంటారా? అని సూటి ప్రశ్న
- మాజీ కెప్టెన్ మైఖేల్ అథర్టన్ సలహాకు కౌంటర్

స్పోర్ట్స్, ప్రజాస్వరం

భారత్, పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్‌లను నిలిపివేయాలంటూ వస్తున్న డిమాండ్లపై బీసీసీఐ అధికారి ఒకరు స్పందించారు. ఈ విషయంపై మాట్లాడటం తేలికే కానీ, ఆచరణలో ఎన్నో ఆర్థిక సవాళ్లు ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. స్పాన్సర్లు, బ్రాడ్‌కాస్టర్ల ప్రయోజనాలను విస్మరించి నిర్ణయాలు తీసుకోలేమని పరోక్షంగా స్పష్టం చేశారు.

ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ అథర్టన్ ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో బీసీసీఐ అధికారి ఈ విధంగా స్పందించారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పరిష్కారమయ్యే వరకు ఐసీసీ టోర్నీలలో భారత్‌పాక్ మ్యాచ్‌లను తగ్గించాలని, ఇందుకోసం పారదర్శకమైన డ్రా పద్ధతిని అనుసరించాలని అథర్టన్ సూచించారు. "క్రికెట్ ఇప్పుడు రాజకీయ ఉద్రిక్తతలకు, ప్రచారానికి వేదికగా మారింది. ఆర్థిక ప్రయోజనాల కోసం టోర్నీల షెడ్యూల్ మార్చడాన్ని సమర్థించలేం" అని ఆయన తన కాలమ్‌లో పేర్కొన్నారు.

అథర్టన్ సూచనపై స్పందిస్తూ, పేరు చెప్పడానికి ఇష్టపడని ఆ బీసీసీఐ అధికారి ఓ జాతీయ మీడియా సంస్థతో మాట్లాడారు. "ఇలాంటి విషయాల గురించి మాట్లాడటం చాలా సులభం. కానీ స్పాన్సర్లు, బ్రాడ్‌కాస్టర్లు దీనికి అంగీకరిస్తారా? కేవలం భారత్ అనే కాదు, ఏ పెద్ద జట్టు టోర్నీ నుంచి తప్పుకున్నా స్పాన్సర్లను ఆకర్షించడం కష్టమవుతుంది" అని ఆయన వాస్తవ పరిస్థితిని వివరించారు.

గత నెల 28న ముగిసిన ఆసియా కప్ ఫైనల్ తర్వాత ఈ వివాదం పెద్దదైంది. పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల మంత్రిగా ఉన్న ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చీఫ్ మొహిసిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని స్వీకరించడానికి భారత జట్టు నిరాకరించింది. పహల్గామ్ ఉగ్రదాడి బాధితులకు సంఘీభావంగా పాక్ ఆటగాళ్లతో కరచాలనం చేయడానికి కూడా టీమిండియా ఇష్టపడలేదు. ప్రస్తుతం భారత్, పాకిస్థాన్ జట్లు కేవలం ఐసీసీ టోర్నీలు, ఆసియా కప్ వంటి ఈవెంట్లలో మాత్రమే తలపడుతున్నాయి. 2013 తర్వాత ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్ జరగలేదన్న విషయం తెలిసిందే.

## టీమిండియాలో ఏం జరుగుతోంది.. గంభీర్‌ను టార్గెట్ చేసిన మనోజ్ తివారీ!

- సీనియర్లను గంభీర్ బలవంతంగా రిటైర్ చేయించారని సంచలన వ్యాఖ్య
- ప్రశ్నిస్తారనే భయంతోనే రోహిత్, కోహ్లీ, అశ్విన్‌లను దూరం పెట్టారని ఆరోపణ
- గంభీర్ కోచ్ అయ్యాకే జట్టులో వివాదాలు పెరిగాయని విమర్శ
- 2027 ప్రపంచకప్‌లో వారిద్దరూ లేకపోతే అది చెత్త నిర్ణయమన్న తివారీ

స్పోర్ట్స్, ప్రజాస్వరం

టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి జట్టులో వివాదాలు పెరిగాయని, సీనియర్ ఆటగాళ్లు జట్టుకు దూరం అయ్యేలా ఒకరకమైన వాతావరణం సృష్టించారని భారత మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ సంచలన ఆరోపణలు చేశాడు. రవిచంద్రన్ అశ్విన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజాలు అర్ధాంతరంగా రిటైర్మెంట్ ప్రకటించడం వెనుక గంభీర్ పాత్ర ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశాడు.

ఇటీవల ఓ క్రీడా ఛానెల్‌తో మాట్లాడిన తివారీ, గంభీర్ తీరుపై తీవ్ర విమర్శలు చేశాడు. "జట్టులో అశ్విన్, రోహిత్, విరాట్ వంటి సీనియర్లు ఉంటే, వాళ్లకు హెడ్ కోచ్ కన్నా ఎక్కువ అనుభవం ఉంది. ఏదైనా నిర్ణయం వారికి నచ్చకపోతే, వాళ్లు తప్పకుండా ప్రశ్నలు సంధిస్తారు. ఈ కారణంతోనే వాళ్లు జట్టులో లేకుండా గంభీర్ చూసుకున్నారు" అని తివారీ ఆరోపించాడు. గంభీర్ తన నిర్ణయాలను ఎవరూ ప్రశ్నించకూడదనే ఉద్దేశంతోనే సీనియర్లపై ఒత్తిడి పెంచి, వారు రిటైర్ అయ్యేలా చేశారని ఆయన అభిప్రాయపడ్డాడు.

గతేడాది ఆస్ట్రేలియా పర్యటన మధ్యలో అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించగా, ఈ ఏడాది మే నెలలో ఇంగ్లాండ్ పర్యటనకు కొన్ని వారాల ముందే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయాన్ని తివారీ గుర్తుచేశాడు. "గంభీర్ కోచ్ అయినప్పటి నుంచి జట్టులో అనవసర వివాదాలు ఎక్కువయ్యాయి. హఠాత్తుగా కొందరు ఆటగాళ్లను జట్టులోకి తీసుకురావడం, నేరుగా తుది జట్టులో ఆడించడం వంటివి చూస్తున్నాం. ఆయన నిర్ణయాల్లో స్థిరత్వం లేదు" అని విమర్శించాడు.

భారత క్రికెట్‌కు రోహిత్, కోహ్లీలు అందించిన సేవలను తివారీ కొనియాడాడు. వాళ్లు తమ సర్వస్వాన్ని దేశం కోసం ధారపోశారని, అలాంటి ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌లో గౌరవం కోల్పోతున్నామని భావించినప్పుడే రిటైర్మెంట్ వైపు మొగ్గుచూపుతారని అన్నాడు. రాబోయే 2027 ప్రపంచకప్ ప్రణాళికల్లో రోహిత్, కోహ్లీలను చేర్చుకోకపోతే అది గంభీర్ తీసుకునే అత్యంత చెత్త నిర్ణయం అవుతుందని ఆయన హెచ్చరించాడు.



## శుభ్‌మన్ గిల్ ఇప్పట్లో అన్ని ఫార్మాట్లకు కెప్టెన్ కాలేడు



స్పోర్ట్స్, ప్రజాస్వరం

టెస్టులకు సారథిగా ఉన్న శుభ్‌మన్ గిల్ ఇటీవల వన్డేలకూ కెప్టెన్‌గా నియమితుడైన సంగతి తెలిసిందే. రోహిత్ శర్మ స్థానంలో అతడిని కెప్టెన్‌గా చేశారు. ప్రస్తుతం టీ20లకు వైస్ కెప్టెన్‌గా ఉన్న శుభ్‌మన్‌కు త్వరలో నాయకత్వ పగ్గాలు అప్పగిస్తారనే చర్చ జరుగుతోంది. భారత మాజీ బ్యాటర్ రాబిన్ ఉతప్ప ఈ విషయంపై స్పందించాడు. రోహిత్ శర్మ నుంచి వన్డే కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించినప్పటికీ శుభ్‌మన్ గిల్ సమీప భవిష్యత్తులో భారత జట్టుకు అన్ని ఫార్మాట్ల కెప్టెన్‌గా మారలేడని అభిప్రాయపడ్డాడు. గిల్ ఇంకా టీ20ల్లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాల్సి ఉందన్నాడు. శ్రేయస్ అయ్యర్ ను పొట్టి ఫార్మాట్ కెప్టెన్‌గా చేసే అవకాశాలను కొట్టిపారేయలేమని ఉతప్ప పేర్కొన్నాడు.

'టెస్ట్ క్రికెట్‌లో గిల్ మంచి ఆటగాడని నేను అనుకుంటున్నాను. వన్డేల్లోనూ అతని గణాంకాలు బాగున్నాయి. కానీ ఈ స్థాయి ఆటగాడికి మరింత మెరుగైన గణాంకాలు ఉండాలనుకుంటున్నా. సెలక్టర్లు టీ20లకు కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌ను పరిశీలిస్తారని భావిస్తున్నా. పొట్టి ఫార్మాట్‌లో గిల్ ఇంకా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోలేదు. ఆసియా కప్ 2025లో గిల్ బాగా ఆడకపోవడంతో రెండో ఓపెనింగ్ స్లాట్ కోసం సంజు శాంసన్, యశస్వి జైస్వాల్ మధ్య పోటీ నెలకొంది. గిల్ ముందు టీ20 జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలి. అతను కెప్టెన్ అవుతాడని నేనైతే అనుకోవట్లేదు. భారత క్రికెట్‌లో రాత్రికి రాత్రే పరిస్థితులు మారిపోతాయని మనకు తెలుసు. నిజాయితీగా చెప్పాలంటే భారత్‌లో వైస్ కెప్టెన్సీకి పెద్దగా ప్రాధాన్యం లేదు. కొంతమంది వైస్ కెప్టెన్లు కెప్టెన్ కాకపోవడం చూశాం కదా?' అని రాబిన్ ఉతప్ప వ్యాఖ్యానించాడు. అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియా, భారత్ మధ్య మూడు వన్డేల సిరీస్ మొదలవనుంది. ఈ సిరీస్‌తోనే గిల్ వన్డే కెప్టెన్ పగ్గాలు స్వీకరించనున్నాడు.

## శ్రేయస్ అయ్యర్ విషయంలో సంతోషంగా ఉన్నా

స్పోర్ట్స్, ప్రజాస్వరం

టీమ్ఇండియా అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. అందులో భాగంగా ఆసీస్‌తో మూడు వన్డేలు, అయిదు టీ20లు ఆడనుంది. దీనికి సంబంధించి ఇటీవలే బీసీసీఐ.. స్క్వాడ్‌ను ప్రకటించింది. రోహిత్ శర్మను వన్డే కెప్టెన్‌గా తప్పించిన సెలక్టర్లు, శుభ్‌మన్ గిల్‌ను నూతన సారథిగా నియమించారు. అలాగే శ్రేయస్ అయ్యర్‌కు వన్డే జట్టులో చోటు కల్పించడంతోపాటు ఏకంగా వైస్ కెప్టెన్‌ను చేశారు. ఈ నిర్ణయాన్ని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ స్వాగతించాడు. నిలకడగా రాణించే ఆటగాళ్లలో శ్రేయస్ అయ్యర్ ఒకరు. కానీ.. చాలా అరుదుగా ప్రతిఫలం పొందుతాడని హర్భజన్ పేర్కొన్నాడు.

'శ్రేయస్ అయ్యర్ విషయంలో నేను సంతోషంగా ఉన్నాను. అత్యంత అరుదుగా క్రెడిట్ పొందే వాళ్లలో అతడు ఒకడు. నిజానికి టీమ్ఇండియా వన్డే జట్టులో ఆడేందుకు అతడికి పూర్తి అర్హత ఉంది. స్వదేశంలో జరిగిన గత వరల్డ్ కప్‌లో అతడు వరుస సెంచరీలతో ఆకట్టుకున్నాడు. అయ్యర్ ప్రభావవంతమైన ఆటగాడు. అతడు ఫామ్‌లో ఉన్నప్పుడు జట్టులోని ఇతర ఆటగాళ్ల పని తేలిక చేస్తాడు. తిరిగి టీమ్‌లోకి కేవలం సభ్యుడిగానే కాకుండా.. వైస్ కెప్టెన్‌గా పునరాగమనం చేస్తున్నందుకు నేను ఎంతో సంతోషంగా ఉన్నా. అతడు శుభ్‌మన్ గిల్‌తో కలిసి టీమ్ఇండియాను ఎలా ముందుకు తీసుకువెళతాడో చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా' అని హర్భజన్ సింగ్ వివరించాడు.

అయ్యర్ ఇప్పటి వరకు టీమ్ఇండియా తరఫున 70 వన్డేల్లో 2,845 పరుగులు సాధించాడు. ఇందులో 5 సెంచరీలు, 22 హాఫ్ సెంచరీలున్నాయి. 128* ఈ ఫార్మాట్లో అతడికి అత్యధిక వ్యక్తిగత స్కోర్. అలాగే 14 టెస్ట్ మ్యాచుల్లో 811 పరుగులు చేశాడు. ఇందులో 1 సెంచరీ, 5 హాఫ్ సెంచరీలున్నాయి. 51 టీ20ల్లో 1,104 పరుగులు చేశాడు. ఇందులో 8 హాఫ్ సెంచరీలున్నాయి. ఈ ఫార్మాట్లో 74* అత్యధిక వ్యక్తిగత స్కోర్.



# 'బాహుబలి: ది ఎపిక్' రన్‌టైమ్ ఎంతంటే..



పదేళ్లు పూర్తి చేసుకున్న 'బాహుబలి' మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. రెండు భాగాలుగా అలరించిన ఈ మూవీ ఇప్పుడు 'బాహుబలి: ది ఎపిక్'పేరుతో ఒకే భాగంగా ఈ నెల అక్టోబరు 31న రిలీజ్ కానుంది. ఈ ప్రకటన వెలువడిన నాటినుంచి నెట్టింట రన్‌టైమ్‌పైనే ఎక్కువగా చర్చ జరిగింది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో దీనిపై నిర్మాత శోభు యార్లగడ్డ స్పందించారు. ఈ సినిమా నిడివి: 3 గంటల 40 నిమిషాలని (*స్వల్ప మార్పులుండొచ్చు) వెల్లడించారు. 'బాహుబలి 1' ముగిశాక ఇంటర్వెల్.. తర్వాత 'బాహుబలి 2' ఉంటుందన్నారు. 'దాన వీర శూర కర్ణ' (3 గంటల 46 నిమిషాలు) తర్వాత ఎక్కువ నిడివి ఉన్న సినిమాల జాబితాలో 'బాహుబలి: ది ఎపిక్' చేరనుంది.

**హృతిక్‌ని అనుకోలేదు: శోభు**

అదే ఇంటర్వ్యూలో పలు రూమర్లపై శోభు స్పందించారు. 'బాహుబలి' కోసం ముందుగా హృతిక్ రోషన్‌ను అనుకున్నామన్న వార్తల్లో నిజం లేదన్నారు. 'బాహుబలి: ది ఎపిక్' చివరిలో 'బాహుబలి 3' ప్రకటన ఉంటుందనే ప్రచారాన్నీ ఆయన ఖండించారు. 'బాహుబలి: ది ఎపిక్'లో ఓ సర్‌ప్రైజ్ ఉంటుందని తెలిపారు. 'బాహుబలి' డాక్యుమెంటరీ ఈ ఏడాది చివరిలో ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ అయ్యే అవకాశాలున్నాయన్నారు.

# రూ.60 కోట్ల చీటింగ్ కేసు..



ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేసిన కేసులో నటి శిల్పాశెట్టి దంపతులు ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ కేసులో తాజాగా శిల్పాశెట్టిని ముంబయి పోలీసులు విచారించారు. 4 గంటల పాటు విచారించిన పోలీసులు ఆమె బ్యాంక్ స్టేట్‌మెంట్ వివరాలు, ఇతర ఖర్చుల గురించి ఆరాతీసినట్లు తెలుస్తోంది. కొన్ని కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు కథనాలు వస్తున్నాయి.


ఈ కేసు విషయంలో శిల్పాశెట్టి భర్త రాజ్‌కుంద్రాను కూడా ఇటీవల పోలీసులు విచారించారు. కొన్ని కంపెనీల్లో రూ.60కోట్లు పెట్టుబడులుగా పెట్టినట్లు ఆ సమయంలో ఆయన వెల్లడించారు. దీంతో ఈ నిధుల్ని నిజంగానే సంబంధిత కంపెనీలకు మళ్లించారా లేదా ఇతర వ్యక్తిగత ఖర్చులకు ఉపయోగించారా అనే దానిపైనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులోభాగంగా శిల్పాను విచారించినట్లు తెలుస్తోంది. ఇక శిల్పా దంపతులు ఇటీవల థాయ్‌లాండ్ పర్యటనకు వెళ్లడానికి అనుమతి కోరుతూ బాంబే హైకోర్టులో పిటిషన్ వేయగా కోర్టు దాన్ని తిరస్కరించింది. ఈ కేసు విషయంలో స్పష్టత వచ్చేవరకూ విదేశాలకు వెళ్లడానికి వీల్లేదని పేర్కొంది.

# ఇక ఆషికా రంగనాథ్ ను ఆపడం కష్టమే!



వెండితెరపై వెలుగు రేఖలా తళుక్కున మెరిసే కథానాయికలు కొందరైతే, వెన్నెల ధారలా తెరపై నుంచి జారిపోయి ప్రేక్షకుల గుండె గదుల్లోకి చేరిపోయే కథానాయికలు మరికొందరు. అందం .. ఆకర్షణతో పాటు నాజూకుతనంతో ఆకట్టుకునే అలాంటి కథానాయికల జాబితాలో ఆషికా రంగనాథ్ ఒకరుగా కనిపిస్తారు. ఆషికా అంటే ఆకాశం నుంచి జారిపోయిన అందాల చందమామ అనే విషయం ఆడియన్స్ కి తొలి సినిమాతోనే అర్థమైపోయింది. 'అమిగోస్' సినిమాతో తెలుగు తెరకి పరిచయమైన ఈ తమలపాకు లాంటి అమ్మాయి, ఆ తరువాత 'నా సామిరంగ' సినిమాతో భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాకి ఆమె గ్లామర్ ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచింది. దాంతో ఆ సినిమాకి వెళ్లిన వాళ్లంతా థియేటర్లలో తమ మనసులు పారేసుకునే బయటికి వచ్చారు. ఇక ఈ సుందరి ఇక్కడ వరుసబెట్టి సినిమాలు చేయడం ఖాయమని అనుకున్నారు .. కానీ అలా జరగలేదు. ఆషికా ఆచితూచి కథలను ఎంచుకోవడమే ఇందుకు కారణమని అనుకోవాలి. ప్రస్తుతం ఆమె తెలుగులో 'విశ్వంభర' .. తమిళంలో 'సర్దార్ 2' .. కన్నడలో 'గత వైభవ' సినిమాలతో బిజీగా ఉంది. ఈ కన్నడ సినిమా వచ్చేనెల 14వ తేదీన థియేటర్లకు రానుంది. ఇక 'సర్దార్ 2'.. 'విశ్వంభర' కూడా భారీ అంచనాలు ఉన్న ప్రాజెక్టులే. ఈ సినిమాలు హిట్ కొడితే ఇక ఆషికను ఆపడం కష్టమేననే టాక్ బలంగా వినిపిస్తోంది. సీనియర్ స్టార్ హీరోల సరసన ఆమె బిజీగా కావడం ఖాయమేనని అంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# నవ్వులు పూయించేలా ప్రియదర్శి 'మిత్రమండలి' ట్రైలర్




టాలీవుడ్ నటుడు ప్రియదర్శి మరో కొత్త ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. గీతా ఆర్ట్స్ 2 బాధ్యతల నుంచి విరామం తీసుకున్న నిర్మాత బన్నీ వాస్, తన సొంత బ్యానర్ బన్నీ వాస్ వర్క్స్‌ని ప్రారంభించి, దానిలో మొదటి సినిమాగా మిత్రమండలి అనే సినిమాను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. బన్నీ వాసు ఈ సినిమాను సమర్పిస్తుండగా.. సప్త అశ్వ మీడియా వర్క్స్ మరియు వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

ప్రియదర్శి కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ నిహారిక NM కథానాయికగా నటించబోతుంది. ఈ చిత్రం అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాతో ఎస్ విజయేంద్ర దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. ఆర్ఆర్ ధృవన్ సంగీతం అందించబో తున్నాడు. ఈ సినిమా బ్యాండ్ ట్రూప్ నేపథ్యంలో రాబోతున్నట్లు తెలుస్తుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336, EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999